# అభిమానం

బజార్లోంచి వీధితలుపుగుండా తన్నిన బంతికిమల్లే గెంతుకుంటూ పుస్తకాల సంచీతో వరండాలోకి వచ్చి దూకాడు చంద్రుడు.

రోజూ సాయంత్రం చంద్రుడు బడినుంచి యింటికివచ్చి, పుస్తకాలసంచీ యింట్లోపారేసి, ఆటలకు వెళ్ళేసమయానికి వరండాలో అమ్మ సీతకు జడవేస్తూం డేది. తన కింకా బడి యోగ్యత పట్టలేదు గనుక చంద్రుణ్ణి చూడంగానే జడ వేయిం చుకుంటున్న సీత, చంద్రుడు బడికి వెళ్ళినప్పటినుండి జరిగిన సంఘటనలు జడ కుదరనీయకుండా తలా చేతులూ తిప్పుతూ గుక్క తిరక్కుండా ఏకరువు పెడ్తుంటే, అమ్మ ఆ వొక్క నిమిషంలో కొంపలంటుకుని కప్పులు మీదపడ్డంత గొడవచేసే సమయంలో- సీతను బుగ్గలు గిల్లుతూ పరామర్శించి, పుస్తకాల సంచీని వదిలించుకుని చంద్రుడు బయటపడేవాడు యీలలు కొట్టుకుంటూ.

"సీతా!" అంత దూకుడుమీద వచ్చిన చంద్రుడు వూపు ఆపుకుంటూ అట్లాగే నిల్చునిపోయాడు వరండామూల నక్కుకుని కూచున్న సీతను చూసి.

"ఎందుకే అట్లా కళ్లు రుద్దుకుంటున్నావ్-" చప్పున వచ్చి సీతపక్కన కూచున్నాడు చంద్రుడు.

"వూఁ-ఫో-"

"ఎందుకే, ఎందుకే- చెప్పవుకాదూ- ఎందుకే ఏడుస్తున్నావూ?"

"వూఁ-, వూఁ-," ఎక్కసాగింది సీతకు.

"అదుగో అందుకే- మా అమ్మగదూ- ఏమే, వాళ్ల కిష్టాయ్ కొట్టాడా?"

"అమ్మ—అమ్మకొట్టింది- వూఁ- వూఁ-"

"అమ్మేగదా- యింకా కిష్టాయ్‌గాడ్డేమోననుకున్నా."

"ఫో-- ఫో- ఎందుగ్గొట్టాలేం వుత్తపున్నానికే- వుహుఁ- వుహుఁ-" తగిన సానుభూతి పొందని సీత ఒక్క సారి బావురుమంటూ కాళ్ళతో చంద్రుణ్ణి తన్నటం మొదలుపెట్టింది.

"ఎందుకే- ఎందుకమ్మా నన్ను తంతావూ- నీకు బిళ్ళలు కొనిపెడ్తాగా- అమ్మను కొడ్దాంలే- ఎందుగ్గొట్టిందీ అమ్మ సీతా?" బుజ్జగిస్తూ సీతను దగ్గిరకి లాక్కున్నాడు చంద్రుడు.

"వుత్తపున్నానికి కొట్టింది పాపం వూఁ- వూఁ-"

"మరి నువు అల్లరిచేశావా?"

"ఎప్పుడూ అల్లరేనమ్మా పాపం-"

"మరేంజేస్తే కొట్టిందే ?"

"మరె నే నేమో- యిందాకేమో- ఆ పొయిదగ్గర అమ్మ వీపుమీద ఆను కుంటేనూ- చూడమ్మా ఎట్టా కొట్టిందో నెత్తు రొచ్చేట్టూ-" వొంగి వీపుమీద గౌనులాగి చూపింది.

ఒక్క క్షణం తల దిమ్మరపోయింది చంద్రుడికి, సీత వీపు మీద కమిలి పోయిన అయిదువేళ్ళూ చూసేసరికి. అమ్మ యింత దెబ్బకొడ్తుందని చంద్రుడికి మొదటిసారి తెలిసింది.

"అమ్మో ! ఎందుకొట్టిందే యిట్లా !"

"చెప్పలేదయ్యా— వుత్తినే— వూఁ వూఁ-" ఒక్కసారి కొత్తబాధ ముంచుకొచ్చింది సీతకు.

"అమ్మేదే-?"

"దొడ్లో వుంది-పాపం-"

"ఈ అమ్మ యిట్లా కొడ్తుందేం- !" అనుకున్నాడు చంద్రుడు పెద్దగా.

* * *

రాత్రి పదింటికి యింటికి వచ్చి నాన్నే అన్నం పెట్టుకుంటున్నాడు. అమ్మ దొడ్డిగుమ్మంలో కూచుని చీకట్లోకి చూస్తున్నది. రోజూ అమ్మా నాన్నా యిద్దరూ కలిసి అన్నం తినేవాళ్ళు...

"అమ్మ అన్నం తింటం లేదెందకో !" అనుకున్నాడు చంద్రుడు.

"నాన్న అమ్మను కొట్టాడ్రా" అన్నది చంద్రుడి పక్కలో సీత. వెంటనే చంద్రుడు తెలుసుకున్నాడు, సీత యివాళ తొందరగా నిద్రపోవటానికి అవకాశం లేదని.

"పెద్దగా అరవబోకే- యింకా నీవు నిద్రపోయినావనకున్నా-"

నిజంగారా, నాన్న అమ్మను కొట్టాడు- నే చూశారా- అబ్బ- అమ్మ ఎట్టా ఏడ్చిందనుకున్నా-" చప్పున సీత నోరు మూశాడు చంద్రుడు వొక్కక్షణం.

వంటింట్లో అన్నపు గరిటె గిన్నెకుతగిలి ఖంగ్‌మంది. అమ్మ అట్లాగే కూచుంది.

"ఎందుకొట్టాడే ?" అన్నాడు చంద్రుడు, యింకొంచెం సీతదగ్గరకు జరిగి, గొంతు వెలుగురాచుకుపోయిన స్థాయిలో సంభాషణ సాగిస్తూ.

"మరే, అమ్మే, చీరె తీసుకురమ్మంది నాన్నని."

"ఏం చీరే ?"

"కొట్టోంచి కొత్తచీరెరా !"

"ఈ అమ్మకు ఎప్పుడూ చీరెలుండవు !"

"అమ్మకు కాదురా అన్నాయ్ చీరే."

"మరి ఎవరికే ?"

"మనత్తయ్య వొస్తుందిట్రా !"

"ఎవరూ- కనకమ్మత్తయ్యా ?"

"ఆఁ."

"ఒస్తే-?"

"అమ్మ అత్తయ్యకు చీరె కొంటుందిట !"

"అమ్మో ! ఆ అత్తయ్యకు చీరెలు కావాల్సిందే ! మరి కారున్నదిగా ఆ అత్తయ్యకూ-"

"మనం ఎక్కొద్దుట్రా అన్నాయ్ కారూ- మరీ- నేనే- చక్రం తిప్పి పుఁయ్ మనిపిస్తా-" ఒక్క క్షణం సీత నోటిమీద చంద్రుడి అరచెయి ఆగింది.

"దాని కారెక్కావంటే నీ చెవులు పిండుతా సీతాం."

"ఏంట్రా అన్నయా- మనత్తయ్యది కాదమ్మా కారూ ?"

"ఉన్నదిలే బొంబోడి కారు దీనికే ! నేను పెద్దవాణ్ణయితే స్టీమరంత కారు కొంటా !"

"స్టీమరంటే ఏంట్రా అన్నాయ్ ?"

"అబ్బో అది కొండంత వుంటుంది !"

"అబ్బ !"

"మహ గొప్ప-టుప్పాయి కారు !"

"అన్నాయ్ ?"

"ఏంటే ?"

"మరి నువు తెల్లవారి పెద్దవాడి వవుతా ?"

"ఛా-తెల్లవారంటే రేప్పొద్దున్నే గాదుటే ?"

"మరి ఎన్ని తెల్లవార్లకు పెద్దవాడి వవుతా ?"

"పోవే నీకేం తెలియదూ- మరి నాన్నంత పెద్దవాణ్ణయితే, అప్పుడూ."

"నాన్నంత పెద్దవాడి వవుతే- అప్పుడు అమ్మను కొట్టవుట్రా ?"

"ఛీ అట్లా అంటే కళ్ళు పోతయ్యేవ్ సీతాం. మనమ్మ మంచిది !"

"మరి నన్నెందుకు కొట్టిందమ్మ ?"

"మంచమ్మ కొద్తే ఏమ్మా!" సీతాం వీపు ఎందుకు వాతతేలిందీ తెలుసుకుంటానికి ఆటే సేపు పట్టలేదు చంద్రుడికి.

"ఆఁ!"

"మరి కనకమ్మత్తయ్యకు చీరె తెమ్మంటే నాన్న అమ్మను కొట్టాట్టే?"

"అహాఁ-అప్పుడే కొట్టలా!"

"మరెప్పుడూ ?"

"చాలా సేపయినాక కొట్టాడు"

"ఎందుకనే చాలా సేపయినాక కొట్టిందీ ?"

"మరే, నాన్న డబ్బు లేదంటుంటే అమ్మ చీరె తెమ్మంటున్నదీ- మరెట్లా ?"

"ఈ అమ్మ ఎప్పుడూ యింతే- అసలే నాన్న దగ్గిర డబ్బు లేదంటుంటే."

"మరే- 'నే దరిద్రుణ్ణే' అని ఇట్లా తలకాయ పట్టుకుని అన్నాడ్రా నాన్న !"

"ఆస లెందుకో యీ కనకంకు చీరే !"

"మరి నాన్న దగ్గిర చాలా కాన్లున్నయి గదుట్రా ?"

"ఎక్కడయినా కానీలకు కొత్తచీరె వొస్తుందటే సీతాం ?"

"రాదుట్రా ?"

"అస్సలు రాదు."

"మరి నా దగ్గిర రెండు మూడు కాన్లున్నయ్యే-"

"బిళ్ళలు కొనుక్కుందాంలే."

"అమ్మ నీకువల్లే పుత్తకాలు కొనుక్కోమందిరా ఇన్ని పదికాన్లయినాకా! మరే, నేనే, పరికిణీ కొనుక్కుంటానంటే సరే దాచుకోమందిరా. అన్ని కాన్లుంటే పరికిణీ వస్తుందిట్రా అన్నాయ్ ?"

"సరేలే, నేను కొట్లో కనుక్కుంటాలే."

"అన్నయ్యా- మన కనకమ్మత్తయ్య గొప్పదిట్రా ?"

"ఎవరన్నారే ?"

"మరే, అమ్మేమన్నదంటే నాన్నతో 'మీ చెల్లెలు వాళ్లు గొప్పవాళ్ళు- సిగ్గేస్తుంది' అన్నదిరా !"

"ఆసలీ కనకమ్మత్తను పంగలకర్రతో కొట్టాలి !"

"కనకమ్మత్తను చూస్తే సిగ్గేస్తుందట్రా అన్నాయ్?"

"అమ్మకు సిగ్గేస్తుంది!"

"నీకో?"

"చచ్చినా వెయదు."

"మరి అమ్మకు ఎందుకేస్తుందిరా సిగ్గు?"

"వూరుకోలే నీకు తెలియదుగానీ—"

"ఎందుకు తెలియదమ్మా-"

"సీతాం?"

"ఏంట్రా అన్నాయ్?"

"కనకమ్మత్తయ్య ఎప్పుడొస్తుందే?"

"వుత్తరం రాసిందట్రా చెన్నపట్నంపోతూ యిక్కడదిగి పోతానని."

"అది మంచిది కాదే."

"ఏదిరా?"

"కనకమ్మత్త."

"ఎందుకన్నా?"

"పిసినారి."

"అంటే ఏంట్రా అన్నాయ్?"

"నీకు బిళ్లలు కావాలని ఏడుస్తుంటే ఒక్క కానన్నా యియ్యాదు."

"కనకమ్మత్తయ్య దగ్గిర చాలా కాన్లున్నయ్యా?"

"అబ్బో వాళ్లింట్లో గోతాల్నిండా వున్నాయి."

"మరి ఒక్క కానన్నా యియ్యాదుట్రా బిళ్లలు కొనుక్కోంటానికి?"

"యియ్యదు."

"ఆఁ! మరి అమ్మ కనకమ్మత్తయ్యకు ఎందుకు చీరె కొనాలమ్మా?"

"కనకమ్మత్తయ్యకు చాలా డబ్బుందిగా! మరి మనమ్మకూడా చాలా డబ్బుందని చూపించి గొప్ప చెప్పుకుందామని."

"అట్లా ఎందుకురా అమ్మ అంటుంది అన్నాయ్! మరి నాన్న డబ్బు ల్లేవన్నాడుగా!"

"నా పుస్తకాలకే డబ్బుల్లేవు నాన్నదగ్గర."

"నా పరికిణీకోమ్మా?"

"లేవమ్మా."

"అయితే కనకమ్మత్తయ్య మనింటికొద్దు."

"ఒస్తే రానీ-"

"చీర కొనిపెట్టొద్దు"

"ఎవడు కొనిపెడ్తాడేం- అసలీ కనకమ్మత్తయ్య బోలెడన్నిసార్లు కాఫీలు తాగుతుంది, అసలే నాన్నదగ్గిర డబ్బుల్లేకపోతే!"

"అన్నయ్యా, మరే, పొద్దున అమ్మే, నా చేత రంగయ్య కొట్టోనించి అన్ని కొన్నుపెట్టి- అంత కాఫీపొడి తెప్పించిందిరా- ఎవ్వర్తో చెప్పద్దంది."

"ఎక్కడివే అమ్మకు అన్ని కాన్లు సీతా?"

"కిష్టాయిగారమ్మ దగ్గిర తెచ్చిందిరా! మళ్ళీ నాన్నదగ్గిర తీసుకు నిస్తానని."

"నాన్నకు తెలుస్తే చంపడూ!"

"మళ్ళీ గొడ్తాడా నాన్న అమ్మనూ!"

"ఈ అమ్మకేం తెలియదు-"

"ఎట్లా-!"

"స్- అరవకే నాన్న చెయి కడుక్కుంటున్నాడూ-"

"అమ్మ అన్నం తిన్లేదురా అన్నాయ్."

"తిన్లేదే సీతాం- అరవకు-"

ఒక అర్థరాత్రి అమ్మ వంటింటోనించి మూతి తుడుచుకుంటూ నాన్నగది లోకి పోవటం చూసింది సీత.

*